క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమ్మవారి ఆరాధనోత్సవాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

డోన్ టౌన్ : పట్టణంలోని కొండపేటలో వెలసిన రేణుకా యల్లమాంభేశ్వరిదేవి ఆలయంలో 18వ ఆరాధనోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి చీరసారే, భోనాలు సమర్పించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేక పూజల అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజు, చంద్రశేఖర్‌గౌడ్, నాగేషయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు పూజలు

బేతంచెర్ల: గ్రామదేవతలకు మంగళవారం భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అమ్మవారి శాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవితోపాటు గ్రామాల్లో మారెమ్మ, సుంకులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉప సర్పంచ్ మృతి

అవుకు: మండల పరిధిలోని జునుంతల గ్రామ ఉప సర్పంచ్, చల్లా కుటుంబ ముఖ్య అనుచరుడు బోయ వెంకటసుబ్బన్న (78) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చల్లా సూర్యప్రకాష్ రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకుడు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, చల్లా ప్రభాకర్ రెడ్డి తదితరులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండాగా ఉంటామని భరోసా ఇచ్చారు.

17 నుంచి రామచంద్రస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు

బనగానపల్లె రూరల్ : మండలంలోని యనకండ్లలోని జయజ్యోతి సిమెంట్ పరిశ్రమ ప్రాంగణంలో నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 17వ నుంచి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు పరిశ్రమ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. నాలుగు రోజులపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని సూచించారు.

ప్రమాణ స్వీకార వీక్షణకు ఏర్పాట్లు

డోన్ టౌన్ : నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ప్రజలు తిలకించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం ఉదయం 10.30గంటలకు అమరావతిలో నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు చూసేందుకు స్థానిక షాదిఖానాలో పెద్ద స్క్రీన్లు ఏర్పాటు చేశామన్నారు.

బనగానపల్లె రూరల్ : విజయవాడలో బుధవారం నూతన ముఖ్య మంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా ప్రజలు చూసేందుకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో ఉన్న పొదుపు భవనంలో ఎల్‌ఈడీ స్కీన్ ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లను సీఐ గంటా సుబ్బారావు పరిశీలించారు.

చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

మహానంది: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో అమరావతికి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లనున్న నేపథ్యంలో మహానంది మండలంలోని గాజులపల్లె సమీపంలో ఉన్న ఆంజనేయపురం వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని ఈ చెక్‌పోస్టు వద్ద నంద్యాల రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి, తాలూకా సీఐ దస్తగిరి బాబు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అనుమతి ఉన్నవారిని మాత్రమే పంపించాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం.

మహానందిలో భక్తజనసందడి

మహానంది: మహానందిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మంగళవారం రెండు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేలాది మంది భక్తులరాకతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడాయి. భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈఓలు వై.మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు అంబటి శశిధర్‌రెడ్డి, నీలకంఠరాజులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అదును సాగు... దిగుబడులు బాగు!

- మినుము సాగుకు జూలై 15 వరకు అదును
- ముందస్తు వర్షాలతో ఊరట
- తొలకరి వర్షాలు.. సాగుకు అనుకూలం



మినుము పంట

కోవెలకుంట్ల: ఖరీఫ్ సీజన్ జూన్ 1 నుంచి ప్రారంభమైంది. వరుణుడు సైతం కరుణించడంతో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సాగుకు అనుకూలంగా మారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీ అయ్యారు. అయితే అదును మేరకు సాగు చేపడితే దిగుబడులు బాగుంటాయని రైతులకు సూచిస్తున్నారు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు. ప్రత్యేకించి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో అదునుకు మినుము సాగు అన్ని విధాలా లాభదాయకమని కోవెలకుంట్ల మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. 90 రోజుల కాలపరిమితి ఉన్న మినుమును ఏకపంటగా, కంది, పత్తిపైర్లలో అంతర పంటగా సాగు చేసుకోవచ్చన్నారు. జూన్ నుంచి జూలై 15 వరకు మినుము సాగుకు అదును అని చెప్పారు. ఖరీఫ్‌లో మినుము సాగు పద్ధతులను వివరించారు.

నేలలు: మెట్ట ప్రాంతాల్లో తేమను నిలుపుకోగలిగి మురుగు నీరు పోయే వసతి ఉన్న భూములు అనువైనవి. బీడు భూములు పనికిరావు.

విత్తన రకాలు: ఎల్‌బీజీ 20(తేజ), టి–9, ఎల్‌బీజీ 623, డబ్ల్యుబీజీ 26, పీబీసీ–1, ఎల్‌బీజీ 752

ఎరువులు: విత్తడానికి ముందు హెక్టారుకు 20 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం నిచ్చే ఎరువులు వేసి గొర్రుతో కలియదున్నాలి. వరిమాగాణుల్లో మినుము చేసేటప్పుడు ఎరువులు వాడాల్సిన అవసరం లేదు.

విత్తన మోతాదు: ఎకరాకు 6 నుంచి ఏడు కిలోల విత్తనం సరిపోతుంది. 30''10 సెంమీ దూరం ఉండేటట్లు విత్తుకోవాలి.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 30 గ్రాముల కార్బోసల్ఫాన్, 2.5 గ్రాముల థైరమ్ లేదా కాప్టాన్ మందును వాడి విత్తనశుద్ధి చేయాలి.

నీటి యాజమాన్యం: వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు ఒకటి, రెండునీటి తడులు ఇవ్వవలసి ఉంటుంది. ఒకటి, రెండు తేలిక తడులు విత్తిన 30 రోజుల్లోపు, 55 రోజుల తర్వాత ఇవ్వాలి.

సస్యరక్షణ: మొక్కను రెండాకుల దశలో చిత్తపురుగు ఆశించి ఆకులలో చిన్నచిన్న రంధ్రాలను చేసి మొక్కలకు నష్టం కలుగజేస్తాయి. దీని నివారణకు లీటరు నీటికి 2.5 ఎంఎల్ క్లోరిపైరిఫాస్ కలిపి పిచికారీ చేయాలి.

కాండపు ఈగ: ఈ పురుగు క్రియ దశలో కాండంలో చేరి తినడం వల్ల మొక్కలు ఎండిపోతాయి. తొలకరి పైరును ఎక్కువగా ఆశిస్తుంది. దీని బెడద విత్తన తర్వాత 30 రోజుల వరకు ఉండి అనుకూల పరిస్థితుల్లో పైరు చివరి దశ వరకు కొనసాగుతుంది. దీని నివారణకు లీటరు నీటికి 1.5 ఎంఎల్ మోనోక్రోటోఫాస్ లేదా 1 గ్రాము ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలి.

తెల్లదోమ: ఆకులలోని రసాన్ని పీల్చి పంటకు నష్టం కలుగజేస్తాయి. వీటి వల్ల ఎల్లోమొజాయిక్ అనే వైరస్ వ్యాధి వస్తుంది. నివారణకు లీటరు నీటికి 1.6 ఎంఎల్ మోనోక్రోటోఫాస్ లేదా 2 ఎంఎల్ మెటాసిస్టాక్స్ కలిపి పిచికారీ చేయాలి.

ఆకుముడత పురుగు: పైరు లేత దశలో వృద్ధి చెంది ఆకులలోని రసాన్ని పీల్చి 15–20 శాతం నష్టాన్ని కలుగజేస్తాయి. వీటివల్ల ఆకుముడత వైరస్ వస్తుంది. ఈ వ్యాధి వర్షాభావ పరిస్థితులకు తోడు అధిక ఉష్ణోగ్రతలున్నప్పుడు ఎక్కువగా వ్యాపిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి 1.5 ఎంఎల్ మోనోక్రోటోఫాస్ లేదా 1 గ్రాము ఎసిఫేట్ లేదా 1 ఎంఎల్ ఫిప్రోనిల్ కలిపి పిచికారీ చేయాలి.

మారుకా మచ్చలపురుగు: ఈ పురుగు మొగ్గ, పూత, పిందె దశలో ఆశించి ఎక్కువగా నష్టం చేకూరుస్తుంది. సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టకపోతే 50–80 శాతం నష్టం చేకూరుతుంది. ఈ పురుగు పూత, పిందెల దగ్గర చేరి గూడులో ఉంటూ కాయలోని గింజలను తింటుంది. దీని నివారణకు లీటరు నీటికి 1 గ్రాము ఎసిఫేట్ లేదా 2 ఎంఎల్ క్వినాల్‌ఫాస్ లేక 2.5 ఎంఎల్ క్లోరిపైరిఫాస్ లేదా 1ఎంల్ డైక్లోరోవాస్ కలిపి పురుగు ఉధృతి మేరకు 4–5 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

కలుపునివారణ/అంతరకృషి

మినుము విత్తుటకు ముందు ఫ్లుక్లోరాలిన్ ద్రావణాన్ని ఎకరాకు లీటరు చొప్పున భూమిపై పిచికారీ చేసి గుంటికతో పైపైన కలియదున్నాలి. పెండిమిథలిన్ ద్రావణాన్ని ఎకరాకు 1.3 నుంచి 1.6 లీటర్ల చొప్పున విత్తిన వెంటనేకాని, మరుసటిరోజుకాని పిచికారీ చేయాలి. విత్తిన 20–25 రోజులప్పుడు గొర్రుతో అంతరకృషి చేయాలి. వరి మాగాణుల్లో ఊద, చిప్పెర, గరికలాంటి గడ్డిజాతి మొక్కల నిర్మూలకు ఎకరాకు 250 మి.లీ ఫెనాక్సోప్రాప్ ఇథైల్ అనే ద్రావణాన్ని లేదా ఎకరాకు 400 ఎంఎల్ క్విజాలాసాప్ ఇథైల్ అనే ద్రావణంలో ఏదో ఒకదానిని 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 20–25 రోజుల తర్వాత పిచికారీ చేస్తే సమర్థవంతంగా కలుపు నివారించవచ్చు. తొలిదశలో అధిక తేమను తట్టుకుని త్వరగా పెరిగే ఎల్‌బీజీ 402, ఎల్‌బీజీ 611, ఎల్‌బీజీ 648 రకాలను సాగు చేయాలి.

550 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ

ప్యాపిలి: మండల పరిధిలోని రైతులకు ఇప్పటి వరకు 550 క్వింటాళ్ల సబ్సిడీ వేరుశనగ పంపిణీ చేశామని వ్యవసాయాధికారి రాజేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 3 వేల క్వింటాళ్ల వేరుశనగ కొరకు ప్రతిపాదనలు పంపగా 1,100 క్వింటాళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు చెల్లించిన రైతులకు పంపిణీ చేశామన్నారు. ప్యాపిలి, పెద్దపొదిళ్ల, చిన్నపొదిళ్ల, వెంగళాంపల్లి గ్రామాల రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. పీఆర్ పల్లి, జక్కసానికుంట్ల, గుడిపాడు గ్రామాల రైతులు డబ్బులు చెల్లించాల్సి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు డబ్బులు చెల్లిస్తే వెంటనే వేరుశనగ పంపిణీ చేస్తామన్నారు.

ఎమ్మార్సీకి చేరిన 29 వేల పాఠ్యపుస్తకాలు

ప్యాపిలి: స్థానిక ఎమ్మార్సీకి ఇప్పటి వరకు 29 వేల పాఠ్య పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ వెంకటేశ్ నాయక్ మంగళవారం తెలిపారు. 1 నుంచి 10 వ తరగతి వరకు మొత్తం 42 వేల పాఠ్యపుస్తకాలు అందాల్సి ఉండగా మొదటి విడతలో 7 వేలు, రెండో విడత 22 వేలు పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన మొత్తం 6,920 మంది విద్యార్థులకు సరిపడా నోటు పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. విద్యా కానుక కిట్లు, బూట్లు, యూనిఫాంతో పాటు ఇంకా రావాల్సిన పాఠ్యపుస్తకాలు వచ్చిన వెంటనే పంపిణీ చేపడతామని ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా మూడు రోడ్ల కూడలి !



కొలిమిగుండ్ల మూడు రోడ్ల కూడలి

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని జమ్మలమడుగు క్రాస్ రోడ్డులోని మూడు రోడ్ల కూడలి ప్రమాదకరంగా మారింది. 544–డీ జాతీయ రహదారి, నెల్లూరు–ముంబై ప్రధాన రహదారి నుంచి ప్రయాణించే వాహనాలు ఈకూడలి వద్ద కలుస్తుంటాయి. వందలాది వాహనాలు రాక పోకలు సాగుతుంటాయి. ఈప్రదేశం ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సుమారు 13ఏళ్ల క్రితం కూడలిలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని అప్పట్లో ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చారు. విగ్రహ నిర్మాణం చేపట్టక జాప్యం చోటు చేసుకుంది. ప్రస్తుతం రోడ్డు పూర్తిగా ఇరుకుగా మారడంతో రాకపోకలకు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూడలి వద్దకు ఒకే సారి వాహనాలు చేరుకునే సమయంలో ఢీకొన్న సందర్భాలు అనేకం. రాత్రి వేళల్లో వాహనదారులు పూర్తి అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

సీట్లకు పెరుగుతున్న డిమాండ్

- మోడల్ స్కూల్, కేజీబీవీల్లో చేర్పించేందుకు తల్లిదండ్రుల ఆసక్తి
- సీట్ల పరిమితి పెంచాలని కోరుతున్న తల్లిదండ్రులు



కొలిమిగుండ్ల మోడల్ స్కూల్

కొలిమిగుండ్ల: కార్పొరేట్ పాఠశాలల తరహాలో మోడల్ స్కూల్, కస్తూర్బా బాలికల పాఠశాలల్లో విద్యాబోధన, వసతులు ఉండటంతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏటేటా ఈ సీట్లకు డిమాండ్ పెరుగుతుంది. పాఠశాలల నిర్వహణకు నిధుల కొరత లేక పోవడంతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులు, కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా వసతులు ఉండటంతో తల్లిదండ్రులు ఈపాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు పోటీ పడుతున్నారు. మోడల్ స్కూళ్లలో ఏటా ప్రవేశ పరీక్ష పద్ధతిలో భర్తీ చేస్తుంటారు. ఆరవ తరగతిలో చేరేందుకు ఇటీవలనే ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈపరీక్షలో విద్యార్థులు సాధించిన మార్కులతో పాటు రిజర్వేషన్ ఆధారంగా సీట్లు కేటాయిస్తు వస్తున్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు విద్యార్థినులకు హాస్టల్ వసతి ఉంటుంది. అలాగే కస్తూర్బా బాలికల పాఠశాలలో ఆరవ తరగతిలో ప్రవేశాలకు ఎలాంటి ఎంట్రెన్స్ పరీక్ష ఉండదు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకున్న వారిని లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారు. కస్తూర్బాలో ఆరవ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఉంటుంది. ఇక్కడ నాణ్యమైన భోజనం, విద్యతో పాటు నిరంతం విద్యార్థినులపై పర్యవేక్షణ ఉంటుంది. అందుకే సీట్ల కోసం ధరఖాస్తు చేసుకునే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. ప్రతి విద్యా సంవత్సరంలో మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థులు సంఖ్య పెరుగుతుండటంతో సీట్ల సంఖ్య పెంచాలని విద్యార్థుల తల్లితండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

నీటిని వడపోసి తాగాలి



మహిళతో మాట్లాడుతున్న కమిషనర్ జయరామ్

డోన్ టౌన్ : వర్షా కాలంలో మంచి నీటిని వేడి చేసి చల్లార్చి వడపోసి తాగాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర జయరామ్ తెలిపారు. పట్టణంలోని 17వ వార్డులో మంగళవారం కమిషనర్ పర్యటించారు. ప్రజలతో సమస్యలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరంఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహ్మద్‌బాషా, ఇంజినీర్ సురేష్ సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



సంజీవనగర్ రామాలయంలో ప్రత్యేక అలంకారంలో వేంకటేశ్వరస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాశికాంబా చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవా కార్యక్రమం చేపట్టారు. వడిబియ్యం సమర్పించి, 108 వెండి పుష్పాలచే అష్టాదళ పాద పద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం అమ్మవారికి నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి ..

పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి ఉదయం శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో అష్టాదళ పాదపద్మారాధన సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా 108 బంగారు పుష్పాలచే అష్టోత్తర నామ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.

వీడని వర్షం!

- కొనసాగుతున్న నైరుతి
- కోవెలకుంట్లలో 15 మి.మీ వర్షం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు



కొలిమిగుండ్లలో కురుస్తున్న వర్షం

కోవెలకుంట్ల: నైరుతి రుతుపవనాల ప్రభావంతో వారం రోజులుగా స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లో వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం సబ్ డివిజన్‌లోని కోవెలకుంట్ల మండలంలో 15 మి.మీ, దొర్నిపాడు– 17.4 మి.మీ, అవుకు – 6.2 మి.మీ, కొలిమిగుండ్ల– 5.2 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 4.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం సైతం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కుందూనది, పాలేరు, కుందరవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అవుకు, సంజామల మండలాల్లో పలు చెరువులకు జలకళ సంతరించుకుంది. పంట పొలాలు కుంటలను తలపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన మొదటి వారం నుంచే వర్షాలు అనుకూలంగా మారడంతో ఈ ఏడాది సీజన్ అన్ని విధాలా కలిసొస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వరణుడు తెరపిస్తే మినుము, కంది, మొక్కజొన్న, పెసర, బెండ తదితర పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఆయా పంటల సాగుకు సంబంధించి ఇప్పటికే రసాయన ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసుకున్నారు.

కొలిమిగుండ్ల: నైరుతి రుతు పవనాల ప్రభావంతో మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం సాయంత్రం మండల వ్యాప్తంగా మోస్తరు మించి వర్షం కురిసింది. వర్షంతో మండల కేంద్రం కొలిమిగుండ్లలో నిర్వహించే వారంత సంతలో వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జూన్‌లో సాధారణ వర్షపాతం 68.4 మి.మీ కాగా ఇప్పటి వరకు 136.6 మి.మీ కురిసింది. కుంటలు చెరువులను తలపిస్తున్నాయి. అయినా కొలిమిగుండ్ల,అంకిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. విడతలవారీగా వర్షం కురుస్తున్నా భారీ వర్షపాతం నమోదు కావడం లేదు. రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధం అవుతున్నారు.

కురుస్తున్న వర్షాలు... రైతుల్లో ఆనందం


బనగానపల్లె : జూన్ 1న ఖరీఫ్ సీజన్ ప్రారంభవ్వగా వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులతో పాటు అన్నివర్గాల ప్రజల్లో ఆనందం నెలకొంది. బనగానపల్లె నియోజవర్గంలో జూన్ నెలలో సాధారణ వర్షపాతం 58.8 మి.మీ కాగా ఇప్పటికే 200 మి.మీపైగా వర్షపాతం నమోదు అయ్యింది. దీంతో వ్యవసాయ పొలాల్లో ఎక్కడ చూసిన వర్షపు నీరు నిలిచి ఉంది. మంగళవారం సైతం భారీ వర్షపాతం నమోదైంది. దీంతో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు.

వర్షానికి కూలీన ఇల్లు

బేతంచెర్ల: వర్షానికి సోమవారం అర్థ రాత్రి పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన సుంకన్న ఇల్లు కూలీ పోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవ్వరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈసంఘటనలో ఇంట్లో ఉన్న వస్తువులు నిత్యావసర సరుకులు మట్టిలో కలిసిపోయాయి. దాదాపు రూ. 50 వేల ఆస్తి నష్టం జరిగిందని, ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందజేయాలని బాధితుడు సుంకన్న కోరారు.



సంజీవనగర్ లో కూలిన ఇల్లు



కుంటను తలపిస్తున్న పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



కోవెలకుంట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం



పంట పొలాల్లో తగ్గని వర్షపునీరు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

డోన్ రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన మండల మీట్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ ప్రభాకర్, ఏఓ అబ్దుల్‌షఫీ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మల్లన్నకు నృత్య నివేదన

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా మహాదేవ్ కూచిపూడి నాట్య క్షేత్రం గుంటూరు వారిచే సంప్రదాయ నృత్యం ప్రదర్శించారు. మంగళవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో విఘ్నం రాజం భజే, వినాయకకౌత్వం,త్రినేత్రం, భో.. శంభో తదితర గీతాలకు హరిణి, హేమ, వివిక్త, లాస్య, దుర్గా, పావని తదితరులు నృత్యం చేశారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

కనీస వేతనం అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాల్లో మధ్యాహ్నం భోజన తయారు, స్కావెంజర్స్ కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏసురత్నం, ఎల్లయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రం బేతంచెర్లలోని సీఐటీయూ కార్యాలయంలో మధ్యాహ్న భోజనం కార్మికుల సంఘం నాయకురాలు రుక్మిణి దేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న కార్మికులకు పెరిగిన ధరలకు అనుగునంగా మెనూ చార్జీలు పెంచకుండా వెట్టి చాకిరి చేయించుకోవడం సమంజపం కాదన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు విజయలక్ష్మి, శారద, శకుంతల, పద్మావతి, ఫాతిమాభి, జయ్యమ్మ పాల్గొన్నారు.

రామకథకు ఎంతో విశిష్టత ఉంది



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు వెంకటరెడ్డి

బేతంచెర్ల: ప్రపంచ సాహిత్యంలో రామకథకు ఎంతో విశిష్టత ఉందని టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్య నిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ముసలాయిచెర్వులో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు శ్రీమద్రామాయణ విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో శ్రీవారి సేవకులు సోమేశ్వర్‌రెడ్డి, భజన మండలి అధ్యక్షులు వెంకట కృష్ణారెడ్డి, అర్చకులు సుంకులయ్య, గ్రామస్తులు లక్ష్మయ్య, సంజీవుడు, దొడ్డి తిరుపాలు, సుదర్శన్‌రెడ్డి, రాంపుల్లయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(సెంట్రల్): పశువులకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలని నంద్యాల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకట సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ...రానున్న వర్షాకాలంలో పశువులు ఎక్కువగా సీజనల్ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, ముందస్తుగా టీకాలు వేయించి వీటి నుంచి రక్షణ పొందాలన్నారు. వైద్యానికి మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మూగజీవాలకు పెద్ద వ్యాధులు సోకితే నిర్ధారణకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున వ్యాధి నిర్ధారణ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అలాగే దూరప్రాంతాల నుంచి పశువులను ఆస్పత్రికి నడిపించి తీసుకురాకుండా సంచార పశు వైద్యశాలలు ఏర్పాటు చేశారని తెలిపారు. ఆయా సేవల ద్వారా సత్వరమే పశువులకు వైద్యసేవలు అందుతుండటంతో గతంలో కన్నా ఇప్పుడు పశు మరణాలు తగ్గాయని వెల్లడించారు. ఆర్‌బీకేలలో లభించే గడ్డి విత్తనాలు నాటుకుని, తద్వారా లభించే పశుగ్రాసంతో అధిక పాల ఉత్పత్తిని పొందాలని సూచించారు.